

## ముహూర్తం ఖరారైంది

అగ్ర హీరో ఎన్టీఆర్ ప్రస్తుతం పాన్ ఇండియా చిత్రాలు 'దేవర' 'వార్-2' షూటింగ్స్‌తో బిజీగా ఉన్నారు. జూలైలోగా ఈ సినిమాలను పూర్తి చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ చేయబోతున్న సినిమా ఎప్పుడు మొదలవుతుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దాదాపు ఏడాది క్రితమే ఈ సినిమా ప్రకటన వెలువడింది. ఏప్రిల్‌లో సెట్స్‌మీదకు తీసుకురావాలనుకున్నారు. అయితే ఎన్టీఆర్ 'దేవర' 'వార్-2' చిత్రాలతో బిజీగా ఉండటంతో వాయిదా వేశారు. తాజా సమాచారం ప్రకారం ఆగస్టులో ఈ చిత్రాన్ని సెట్స్‌మీదకు తీసుకెళ్తారని తెలిసింది. 'కేజీఎఫ్' 'సలార్' తరహాలోనే రెండు భాగాలుగా ఈ చిత్రానికి ప్లాన్ చేస్తున్నారని చెబుతున్నారు. ఎన్టీఆర్ 'దేవర' ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్నది. దసరా కానుకగా అక్టోబర్ 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది.

## రజనీ చిత్రంలో నాగ్



అగ్ర కథానాయకుడు రజనీకాంత్ ప్రస్తుతం లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. రజనీకాంత్ నటిస్తున్న 171వ చిత్రమిది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో అగ్ర హీరో నాగార్జున కీలకమైన అతిథి పాత్రలో నటించనున్నట్లు తెలిసింది. కథాగమనంలో ఆయన పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుందని సమాచారం. ఈ చిత్రానికి 'రానా' అనే టైటిల్‌ను ఖరారు చేయబోతున్నారని చెబుతున్నారు. ఈ సినిమాలో రజనీకాంత్ కూతురిగా శృతిహాసన్ నటించనుంది. భారీ యాక్షన్ హంగులతో దర్శకుడు లోకేష్ కనకరాజ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇదిలావుండగా ప్రస్తుతం నాగార్జున..ధనుష్‌తో కలిసి మల్టీస్టారర్ 'కుబేర' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే.

## పైసా వసూల్ సినిమా 'రత్నం'



'రత్నం' తన కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమైన చిత్రమని, అన్ని కమర్షియల్ హంగులతో మెప్పిస్తుందని చెప్పారు హీరో విశాల్. ఆయన కథానాయకుడిగా హరి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకురానుంది. తెలుగులో ఈ చిత్రాన్ని సీహెచ్ సతీష్‌కుమార్, కే రాజ్‌కుమార్ విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో హీరో విశాల్ మాట్లాడుతూ 'నేను సినిమాల పరంగా తొలి నుంచి ప్రయోగాలు, సాహసాలు చేస్తున్నా. ఈ క్రమంలో ఎన్నోసార్లు గాయపడ్డాను కూడా. అయినా సరే అభిమానులను మెప్పించేందుకు మంచి కథలను ఎంచుకుంటున్నా' అన్నారు. 'రత్నం' సినిమా గురించి చెబుతూ..గతంలో తాను దర్శకుడు హరితో భరణి, పూజ సినిమాలు చేశానని, అవి కమర్షియల్‌గా భారీ విజయాలు సాధించాయని, అదే తరహాలో 'రత్నం' విజయం సాధిస్తుందని విశాల్ నమ్మకం వ్యక్తం చేశారు. ''రత్నం' నాశైలి యాక్షన్ ఎంటర్‌టైనర్. ఫ్యామిలీ సెంటిమెంట్ ఉంటుంది. దేవిశ్రీప్రసాద్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. నా కెరీర్‌లో ఓ విభిన్నమైన చిత్రంగా నిలిచిపోతుంది' అన్నారు. ఫ్యామిలీ ఎమోషన్స్‌తో ఈ సినిమా ఆకట్టుకుంటుందని, రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ స్థాయిలో విడుదల చేస్తున్నామని డిస్ట్రిబ్యూటర్ సతీష్ కుమార్ తెలిపారు.

## అతనెవరో అడగొద్దు



అగ్ర కథానాయిక విద్యాబాలన్ ప్రధాన పాత్రలో నటించిన 'దో ఔర్ దో ప్యార్' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మూఢనమ్మకాల గురించి ప్రస్తావిస్తూ ఆసక్తికరమైన విషయాలను వెల్లడి చేసింది. 'ఓ దర్శకుడున్నాడు. తనకు మూఢనమ్మకాలెక్కువ. దాంతో లొకేషన్లో వింతగా ప్రవర్తించేవాడు. 42రోజులు ఒకే షర్ట్ ధరిస్తే సినిమా హిట్ అవుతుందని తనకు ఎవరో చెప్పారట. దాంతో లొకేషన్‌లో ఒకే షర్ట్‌తో ఉండేవాడు. ముందు నేను పెద్దగా పట్టించుకోలేదు. వేరేవాళ్ల ద్వారా తెలుసుకుని షాక్ అయ్యాను. తీరా ఆ సినిమా అట్టర్‌ఫ్లాప్. దయచేసి ఆ దర్శకుడెవరని అడగొద్దు. నేను చెప్పను' అంటూ అందంగా నవ్వేసింది విద్యాబాలన్. తనను బాధపెట్టిన ఓ నిర్మాతను కూడా ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు విద్యాబాలన్. 'నన్ను ఓ నిర్మాత తన సినిమాలో హీరోయిన్‌గా తీసుకున్నారు. షూట్ మొదలైంది. కొన్ని రోజుల తర్వాత ఆ సినిమా నుంచి నన్ను తొలగిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. వాకబు చేస్తే.. నా జాతకం మంచిది కాదని, నేను నష్టజాతకురాలినని, అందుకే ప్రాజెక్ట్ నుంచి తొలగించామని ఆయన మీడియాతో చెప్పారట. నిజంగా చాలా బాధ అనిపించింది' అంటూ జ్ఞాపకాలను నెమరువేసుకుంది విద్యాబాలన్.

## నాన్న కోసం ఎంత దూరమైనా..



కార్తికేయ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'భజే వాయు వేగం'. ప్రశాంత్‌రెడ్డి చంద్రపు దర్శకుడు. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మిస్తున్నది. శనివారం ఈ సినిమా టీజర్‌ను అగ్ర నటుడు చిరంజీవి 'విశ్వంభర' సెట్‌లో విడుదల చేశారు. ఈ సినిమా టైటిల్‌తో పాటు టీజర్ చాలా ఇంప్రెసివ్‌గా ఉందని, తన అభిమాని..తమ్ముడు లాంటివాడు అయిన కార్తికేయ నటిస్తున్న ఈ సినిమా విజయం సాధించాలని చిరంజీవి ఆకాంక్షించారు. డ్రగ్స్ కేసు ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో తండ్రీకొడుకుల బంధం ప్రధానంగా టీజర్ ఆకట్టుకుంది. 'ప్రతి ఒక్కరి లైఫ్‌లో ఒకరుంటారు. వారి కోసం ఏం చేయడానికైనా మనం వెనకాడం. నా లైఫ్‌లో అది మా నాన్న' అని కార్తికేయ చెప్పిన డైలాగ్ ఆసక్తిని పెంచింది. యాక్షన్ ఘట్టాలు కూడా ఆకట్టుకున్నాయి. ఐశ్వర్యమీనన్, రాహుల్ టైసన్, తనికెళ్ల భరణి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆర్.డి.రాజశేఖర్, సంగీతం: రథన్, దర్శకుడు: ప్రశాంత్ రెడ్డి చంద్రపు.

## 'డార్లింగ్' పంచే వినోదం



ప్రియదర్శి, నభా నటేష్ జంటగా నటిస్తున్న చిత్రం 'డార్లింగ్'. 'వై దిస్ కొలవెరి' ఉపశీర్షిక. అశ్విన్ రామ్ దర్శకుడు. 'హనుమాన్'తో పాన్ ఇండియా స్థాయి విజయాన్ని దక్కించుకున్న ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. నిరంజన్ రెడ్డి నిర్మాత. శనివారం టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఆద్యంతం వినోదప్రధానంగా గ్లింప్స్ ఆకట్టుకుంది. జీవితంలోని వివిధ దశల్లో ఆడవాళ్ల మనస్తత్వాల గురించి ప్రియదర్శి చెప్పే డైలాగ్స్ వినోదాన్ని పంచాయి. భార్యభర్తల మధ్య నడిచే రొమాంటిక్, ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కించారని అర్థమవుతున్నది. ప్రభాస్‌ను ఆయన అభిమానులు ప్రేమగా పిలుచుకునే 'డార్లింగ్' పదాన్ని తమ సినిమాకు టైటిల్‌గా పెట్టుకోవడం ఆనందంగా ఉందని, రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా మెప్పిస్తుందని ప్రియదర్శి తెలిపారు. యాక్సిడెంట్ కారణంగా కొంతకాలం సినిమాలు దూరంగా ఉన్నానని, ఆద్యంతం నవ్వించే కథ ఇదని నభా నటేష్ చెప్పింది. ఈ చిత్రానికి కెమెరా: నరేష్, సంగీతం: వివేక్‌సాగర్, ప్రొడక్షన్ డిజైనర్: గాంధీ, దర్శకత్వం: అశ్విన్‌రామ్.

## 18ఏళ్ల తర్వాత..



వెండితెరపై హిట్ పెయిర్‌గా, నిజ జీవితంలో అన్యోన్య దంపతులుగా పేరు తెచ్చుకున్నారు అగ్ర హీరో సూర్య, జ్యోతిక. వివాహనంతరం చాల ఏళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉంది జ్యోతిక. ఇద్దరు పిల్లల బాధ్యతలు తీసుకోవడంతో సినిమాలపై ఏమాత్రం దృష్టిపెట్టలేదు. '36 వయదినిలే' చిత్రంలో వెండితెరపై రీఎంట్రీ ఇచ్చిన జ్యోతిక ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉంది. బాలీవుడ్‌లో అజయ్‌దేవ్‌గన్ సరసన 'సైతాన్' సినిమాలో నటించి భారీ విజయాన్ని దక్కించుకుంది. మలయాళంలో మమ్ముటితో కలిసి ఓ సినిమా చేసింది. త్వరలో కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నది. ఇదిలావుండగా భర్త సూర్యతో కలిసి జ్యోతిక ఓ సినిమాలో నటించనుందనే వార్త కోలీవుడ్‌లో ఆసక్తికరంగా మారింది. సూర్య, జ్యోతిక కలిసి ఉయిరిలే కలందదు, పేరళగన్, కాక్క కాక్క, సిల్లన్ను ఒరు కాదల్ వంటి హిట్ చిత్రాల్లో నటించారు. తాజా సమాచారం ప్రకారం 'బెంగళూరు డేస్' ఫేమ్ అంజలీమీనన్ దర్శకత్వంలో సూర్య, జ్యోతిక సినిమా చేయబోతున్నారని తెలిసింది. ఈ వార్త నిజమైతే పెళ్లయిన తర్వాత సూర్య, జ్యోతిక కలిసి నటించనున్న సినిమా ఇదే అవుతుంది. దాదాపు 18 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ హిట్‌పెయిర్ మరోమారు కలిసి నటించబోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## 1980 నేపథ్యంలో 'హరోం హర'



సుధీర్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హరోం హర'. 'ది రివోల్ట్' ఉపశీర్షిక. జ్ఞానసాగర్ దర్శకత్వంలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ పతాకంపై సుమంత్ జి నాయుడు నిర్మిస్తున్నారు. మాళవిక శర్మ కథానాయిక. ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయని, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ 'చిత్తూరు జిల్లా కుప్పంలో 1989 నాటి నేపథ్యంలో జరిగే కథ ఇది. యాక్షన్, ఎమోషనల్ అంశాలతో సాగుతుంది. అన్యాయాలు, అక్రమాలతో కూడిన వ్యవస్థపై ఓ సామాన్యుడి తిరుగుబాటు ఏమిటన్నదే సినిమా కథ. సుధీర్‌బాబు పాత్ర చిత్రణ పవర్‌ఫుల్‌గా ఉంటుంది' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: అరవింద్ విశ్వనాథన్, సంగీతం: చైతన్ భరద్వాజ్, నిర్మాత: సుమంత్ జి నాయుడు, రచన-దర్శకత్వం: జ్ఞానసాగర్ ద్వారక.

## ఏ పార్టీని టార్గెట్ చేయలేదు



''ప్రతినిధి-2' వ్యవస్థను ప్రశ్నించే నిజాయితీపరుడైన జర్నలిస్ట్ కథ. కలం వీరులకు నివాళిగా ఈ సినిమాను తెరకెక్కించాను. ఇందులో ఏ రాజకీయ పార్టీని టార్గెట్ చేయలేదు' అన్నారు సీనియర్ జర్నలిస్ట్ మూర్తి దేవగుప్తాపు. ఆయన దర్శకుడిగా పరిచయమవుతూ నారా రోహిత్ హీరోగా తెరకెక్కించిన చిత్రం 'ప్రతినిధి-2' ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా దర్శకుడు మూర్తి దేవగుప్తాపు మాట్లాడుతూ 'నాకు కాలేజీ రోజుల నుంచే సినిమాలపై ఆసక్తి ఉంది. అప్పుడు నాటకాలు వేసేవాళ్లం. అలాగే పుస్తకాలు బాగా చదవడం, కథలు రాసే అలవాటు ఉండటం వల్ల సినిమా రంగంపై ఆసక్తి పెరిగింది. దర్శకత్వం తాలూకు మెళకువలను నేర్చుకోవడంతో పాటు ఎంతో రీసెర్చ్ చేసి ఈ సినిమాను మొదలుపెట్టాను' అన్నారు. ఈ సినిమాలో హీరో జర్నలిస్ట్ పాత్రలో నీతి, నిజాయితీలకు ప్రతిరూపంగా కనిపిస్తాడని, నమ్మిన సిద్ధాంతాల కోసం పోరాడుతాడని, పాత్రికేయులను హీరోలుగా చూపించాలనే గొప్ప ఉద్దేశ్యంతో ఈ సినిమా చేశానని ఆయన తెలిపారు. 'ఈ సినిమాలో హీరో చాలా పెద్ద ఇష్యూని డీల్ చేస్తాడు. వ్యవస్థను ప్రశ్నించడంతో పాటు దానిని సంస్కరించే బాధ్యతను కూడా తీసుకుంటాడు. ఇది ప్రాపగాండ మూవీ అసలే కాదు. ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా తీయలేదు. ప్రస్తుతం రాజకీయాల గురించి, ప్రజల భావజాలం గురించి ఈ సినిమాలో లోతుగా చర్చించాం' అని మూర్తి దేవగుప్తాపు అన్నారు. తన దగ్గర నాలుగు కథలు సిద్ధంగా ఉన్నాయని, సినిమా పట్ల పాషన్‌ను ఇక ముందు కూడా కొనసాగిస్తానని మూర్తి దేవగుప్తాపు పేర్కొన్నారు.

## 'ప్రేమలు' సీక్వెల్ కోసం..

ఇటీవల మలయాళంలో విడుదలైన 'ప్రేమలు' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించింది. మలయాళ చిత్రసీమలో బిగ్గెస్ట్ రొమాంటిక్ హిట్‌గా నిలిచింది. తెలుగు వెర్షన్‌కు కూడా అద్భుతమైన ఆదరణ లభించింది. అగ్ర దర్శకుడు రాజమౌళి తనయుడు ఎస్.ఎస్.కార్తికేయ తెలుగు వెర్షన్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఫీల్‌గుడ్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'ప్రేమలు' యువతరాన్ని విశేషంగా ఆకట్టుకుంది. హైదరాబాద్ నేపథ్యంలో నడిచే ప్రేమకథ ఇక్కడి యూత్‌కు బాగా కనెక్ట్ అయింది. ఈ నేపథ్యంలో శనివారం ఈ సినిమాకు సీక్వెల్‌ను ప్రకటించారు. చిత్ర నిర్మాణ సంస్థ భావన స్టూడియోస్ ఈ విషయాన్ని తన సోషల్‌మీడియా ఖాతా ద్వారా అధికారికంగా వెల్లడించింది. వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని విడుదల చేస్తామని తెలిపింది. సీక్వెల్‌ను కూడా తెలుగులో తానే రిలీజ్ చేస్తానని ఎస్.ఎస్.కార్తికేయ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా తెలిపారు. నస్లేన్, మమితాబైజు జంటగా నటించిన ఈ చిత్రానికి గిరీష్ ఏడీ దర్శకత్వం వహించారు.





## కలల వెంట పరుగు

ప్రశాంత్‌కృష్ణ, అనీషాధామ, శ్రీనివాస్ రాంరెడ్డి, ఐశ్వర్య హోలక్కల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'డ్రీమ్ క్యాచర్'. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో సందీప్ కాకుల తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను ఇటీవల విడుదల చేశారు. ఓ విభిన్నమైన కాన్సెప్ట్‌తో ఈ సినిమాను తెరకెక్కించామని, క్లైమాక్స్ ఘట్టాలు ఉత్కంఠను పంచుతాయని దర్శకుడు తెలిపారు. కలల నేపథ్యంలో నడిచే సరికొత్త కాన్సెప్ట్ ఇదని హీరో ప్రశాంత్‌కృష్ణ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ప్రణీత్ గౌతమ్ నంద, సంగీతం: రోహన్ శెట్టి, నిర్మాత, దర్శకత్వం: సందీప్ కాకుల.

